# ఇల్లు

వేసవికాలం, గదిలో పడుకుంటే గాలిరాదు. మబ్బులు కమ్మిన ఆకాశం విరిగి మీద పడుతున్నట్టుగా గదికి సగం ఆవరించిన మసిబారిన అటక. లేచి నిల్చుంటే నెత్తికి తగుల్తుంది. అటకమీద ఎలకల సంసారం, దిగువ సన్యాసిరావు సంసారం. గదిలో పడుకుంటే భయం వేస్తుంది. పగుళ్ళిచ్చిన గది గోడలు పడిపోకుండా తాళ్ళేసి కట్టినట్టు మూలలంట సాలిగూళ్ళు గోడమీదున్న ఎలక్ట్రిక్ దీపంవల్ల పురుగులు, వాటిని వేటాడే బల్లులు అదొక జంతు ప్రదర్శనశాల. కాదు, అది గది కాదు బందిఖానా. బందిఖానా కూడా కాదు, ఎందుకంటే బందిఖానానికి ఎత్తుగా చిన్న కిటికీలు పెడతారట, గాలి రావడానికి ఈ గదికి అదీలేదు.

అంచేత బయట వీధరుగుమీద పడుకున్నాడు సన్యాసిరావు. వీధరుగుమీద గాలి వేస్తుంది. కాని దోమలు నిద్రపోనివ్వవు. సన్యాసి రావుని పీడించే వాటిలో వీధరుగుమీద దోమలూ గదిలో మంచంమీద నల్లులూ అటకమీద ఎలకలూ పెరట్లో తేళ్ళూ జెర్రులూ మొదలైన జీవ రాసికూడా వుంది.

“గదిలో పక్కేశాను” అంది ఇల్లాలు. “నేను వీధరుగుమీదపక్కేసుకున్నాను” అన్నాడు సన్యాసిరావు.

“చేసుకున్న పాపం.”

“ఈ జన్మలోనా గతజన్మలోనా?”

‘‘అసలు మీరు గదిలో ఎందుకు పడుకోరో అర్థం కాదు’’

అసలు నువ్వు వీధరుగుమీద ఎందుకు పడుకోవో నాకూ అర్థం కాదు గదిలో గాలిరాదు, పైగా నల్లులు. అసలది గది కాదు బందిఖానా.

"అందుకనే"....

"అందుకనే యింకో ఇంటికి మారిపోదా మంటావు. ఈ వూళ్ళో యింతకంటే తక్కువ అద్దెకు ఇల్లనేది వుండదు కాబట్టి నేను వద్దంటా నంతేనా?"

"అంతేకాదు అసలు మీరు పొరపాటు చేశారు. మావాళ్ళిచ్చిన కట్నం సొమ్ముతో ఓ చిన్న స్థలం కొనండని మొత్తుకున్నాను. ఆ స్థలంమీద అప్పుతెచ్చి చిన్న కొంప వేసుకొనే వాళ్ళం. చెప్పిన మాట విన్నారు కారు. ఆ సొమ్ము కర్చయిపోయింది."

"ఇప్పుడా? పదేళ్ళ క్రితమే ఖర్చయిపోయింది. మీవాళ్ళిచ్చిన కట్నం రెండువేల రూపాయలకి ఈ వూళ్ళో రుద్రభూమికూడా కాదు"

" ఇంతకీ మీకు ఇల్లు కట్టుకోవాలనే ధ్యాసే లేదు. పోనీ యిప్పు డేనా నావొంటిమీద కొద్దిగా బంగారముంది. కావాలంటే అదమ్మి ఓ చిన్నస్థలం కొనుక్కొని...."

"చాలు, చాలు, ఇంకెళ్ళి పడుకో. బంగారం అమ్మవలసివస్తే ముందు అప్పులు తీర్చడానికి అమ్మాలి, ఇల్లు కట్టడానికిరాదు"

"ఇంతకీ దేనికైనా పెట్టిపుట్టాలి."

సన్యాసిరావుకి నవ్వొచ్చి గట్టిగానవ్వాడు. ఆయనెందుకు నవ్వేడో ఇల్లాలి కర్థంకాలేదు

ఆవిడకి ఇల్లు కట్టుకోవాలని గట్టికోరిక వుంది తన కలాంటికోరిక లేదనుకోవచ్చా? మనిషికి కోరికలుండడం సహజం. కాని తన తాహ తుకు తగిన కోరికలుండడం సహజం. అప్పులో మునిగివున్నవాడు ఇల్లుకట్టాలని కోరడం పసిపిల్లలు చందమామ కావాలని కోరినట్టుగా వుంటుంది. కూలివాలక ఒకపూట తిని రెండోపూట వస్తుందేవాడు కాదు

కొనాలన్నట్టుగా వుంటుంది. అందుకనే తను పనిచేసేమిల్లులో కూలీలు కారు కావాలనీ, బంగళా కావాలనీ, బంగారుసింహాసనం కావాలనీ, పట్ట పేనుగుగాని పట్టపురాణీగాని కావాలనీ కోరుకోరు. వాళ్ళు కూలీ పెంచ మనీ. బోనస్ కావాలనీ, పని గంటలు తగ్గించమనీ, పనిదుస్తులు కావాలనీ కోరుతారు. కాని తాను ఇల్లు కట్టడం అసంభవమా? తనకూ కోరిక వుండడంలో అసహజ మేముంది?

ఇల్లుకట్టుకుంటే బాగానే వుంటుంది. ఓ రెండు గదులు, వంట గదీ, మరుగదొడ్డీ చాలు. పైన డాబా వేసుకుంటే రాత్రుళ్ళు అక్కడ పడుకోవచ్చు. పెరట్లో పాదులుపెట్టి కూరగాయలు పండించుకోవచ్చు. నిజమేకాని యీ మిల్లుగుమాస్తా వుద్యోగంతో, వూరినిండా అప్పులతో ఇల్లుకట్టడ మెలాగ?

అందుకు వృత్తి మారాలి, ఆదాయం పెరగాలి. మిల్లులో ఇంజనీర్లకు, మెకానిక్కులకు, అకౌంటెంట్లకు అందరికీ ఏదో ఒక వృత్తిలో శిక్షణవుంది. వారు తమ వృత్తులను మార్చలేరు. తనకి ఏ శిక్షణాలేదు. కాబట్టి శిక్షణ అవసరంలేని ఏపనైనా చెయ్యవచ్చును. తనంటే కూలీ లందరికీ మంచిగౌరవముంది. కాబట్టి వారందరినీ చేరదీసి సంఘం పెడితే ...

"కామ్రేడ్స్, సోదరులారా, మన మిల్లుయజమానులు ఏడాదికి మూడులక్షలు లాభం గడిస్తున్నారు. ఏమిటీలాభం? అవి మన రక్త మాంసాలు. మనం కట్టవలసిన బట్ట, మనపెళ్ళాంపిల్లలు తినవలసిన తిండి, మనకష్టాన్ని లాభాలుగా మార్చుకుని యజమానులు భవంతులలో సకలభోగాలు అనుభవిస్తున్నారు. మూడు లక్షలు లాభం సంపాదించి మనకి 20 వేలు బోనసస్‌గా ఇస్తున్నారు. మన కష్టాన్ని ఎలా దోచుకుంటున్నారో మీకిప్పుడు తెలిసిందా? మనకి ఆరుమాసాలజీతం

బోనస్‌గా ఇచ్చినా లక్షన్నర రూపాయలకంటె ఎక్కువకాదు. వాళ్ళ లాభంలో సగంకంటె ఎక్కువకాదు. మనమంతా ఐకమత్యంతో గట్టిగా నిలబడాలి. ఇన్‌క్విలాబ్ జిందాబాద్".

"ఇన్‌క్విలాబ్ జిందాబాద్"
"విప్లవం వర్ధిల్లాలి"
"ఆరు మాసాల బోనస్ కావాలి"
"బోనస్ ఇస్తేనే పని, లేకపోతేలేదు."

యజమానుల గుండెల్లో దడ. కార్మికుల ఐక్యత వారికి పక్కల్లో బల్లెం; సింహస్వప్నం....ఏమయ్యా మేనేజరూ, కార్మికులను చిలదీయ లేని వాడివి? నువ్వెందుకు పనికొస్తావు? ఏమయ్యా డైరెక్టరూ, ఈ వ్యాధి ముదరకుండా చెయ్యలేవా? బతిమాలు, బుజ్జగించు, భయపెట్టు, బెదరించు. ఏమైనాసరే కార్మికుల్లో చైతన్యమనే వ్యాధిని ముదరనియ్యకు, అది క్రానిక్ అయితే దానికి మరి చికిత్సలేదు. ఆ వ్యాధికి మరణించేది మనం. తెలిసిందా మిస్టర్! సంఘాన్ని నాశనంచెయ్యి.

"ఏమయ్యా సన్యాసిరావూ, నీకేమైనా కావాలంటేమమ్మల్ని అడగ రాదూ? ఎందుకు చెప్పూ యీ గొడవంతా?"

"గొడవ లేవదీయబట్టే మీరు దిగివచ్చారు"
"అయితే నీకేం కావాలి?"
"కార్మికులకు బోనస్ యివ్వండి"

"వాళ్ళడిగిన బోనస్ యిస్తే మాకు లక్షన్నర నష్టం. వాళ్లకి లాభం. కాని నీకొరిగే దేమిటయ్యా"

"అయితే మీరనేదేమిటి?"

"మన కార్మికులకు నువ్వు నాయకుడుగా వుండడం మాకుచాలా యిష్టం. నీ కష్టం మేముంచుకోం లేవయ్యా: నువ్వో పాతికవేలు

తీసుకో. వాళ్లకో పాతికవేలు పంచిపెడతాం. ఈ వప్పందంవల్ల నీకూ, మాకూ, వాళ్లకీ అందరికీ లాభమే. ఏమంటావ్? అదీ. అలా వుండాలయ్యా నాయకత్వమంటే-ఏదో మనం మనం సర్దుకుపోవాలి. పోట్లాడుకుంటే ఏంలాభం?"

' సోదరులారా! ఈ ఏడాది మన యజమాన్లకు వచ్చిన ఆదాయ వ్యయాలు స్వయంగా దర్యాప్తుచేశాను. లాభంలో ఎక్కువభాగం కొత్తమిషన్లు కొనడం క్రింద కర్చయింది. కాబట్టి మనమడిగిన బోనస్ యివ్వలేమన్నారు. నేను గట్టిగా నిలబడి పట్టుబట్టేసరికి యజమాన్లు దిగొచ్చి మనకిచ్చే ఇరవై వేలతోబాటు అదనంగా మరొక పాతికవేలు యివ్వడానికి ఒప్పుకున్నారు. ఈ సారికి తీసుకుని వచ్చే ఏడాది మళ్ళీ డిమాండ్ పెడదాం. ఇది కార్మిక విజయం. ఇన్‌క్విలాబ్ జిందాబాద్'.

రాత్రి తెల్లవారేలోగా యీ మాసిన గోడల గది చూడముచ్చటయిన చక్కటి బంగళాగా మారిపోయింది. ఇప్పుడు సాలీళ్ళు లేవు. కుక్కిమంచంలేదు. కుళ్ళు కాలువ లేదు. ఇదిఇంద్రభవనం. మనిషి కోరదగిన సుఖం గదిలో ట్యూబులైటు పాల వెలుగులో దూది పరుపుమీద నిద్రపోవాలి. అదే వాస్తవమని తక్కినదంతా మిధ్య అనీ అనిపిస్తుంది.

సన్యాసిరావు సహోద్యోగి శ్రీనివాసరావు పీఠరుగు లేకపోవడం వల్ల గదిలోనే మంచంమీద పడుకుని నిద్రపోవడం లేదు. అతనికి రాత్రుళ్ళు నిద్రపట్టదు. నిద్రపట్టక పోవడానికి కారణం నల్లులూ దోమలూ కాదు. వాటికంటే ఎక్కువ ఆలోచనలు. వొంటికి నలభై యేళ్ళు వచ్చినా తీరని కోరికలు అతన్ని బాధిస్తున్నాయి. శ్రీనివాసరావుకి ఇల్లు కట్టుకోవాలనే కోరికలేదు. కారు కావాలనే కోరిక లేదు. అలాగే రేడియోగ్రాములూ రిఫ్రిజిరేటర్లు అక్కర్లేదు. అయితే శ్రీనివాసరావుకి ముఖ్యంగా పెళ్ళి చేసుకోవాలనే కోరిక వుంది. కాని నూరు రూపాయల

జీతంతో సంసారం నడపడం సాధ్యం కాదని తెలిసి యీ నూరురూపా యల్ని నాలుగురెట్లు చేసే మార్గం ఆలోచించాడు. తరువాత ఇల్లు అద్దెకు తీసుకుని పెళ్ళి చేసుకోవాలి. కాని ఇన్నాళ్ళూ ఆదాయం పెరిగే దోవ కన్పించలేదు. ఇప్పుడు సన్యాసిరావు ఆతోవ చూపించాడు. కార్మికుల్ని తనవేపు తిప్పుకొనడం చాల సులభం.

"సోదరులారా, ఇది కార్మిక విజయం కాదు. ఇది యజమానుల విజయం. సన్యాసిరావు విజయం. కనీసం లక్షరూపాయలైనా కక్కవల సిన యజమానులు ఏభైవేలు కర్చుపెట్టేరు. ఇందులో కార్మికులకి పాతికవేలు, సన్యాసిరావుకి కొత్తఇల్లు. ఇది కార్మిక విజయం కాదు. కార్మిక ద్రోహం.

"ద్రోహం, ద్రోహం, వదండి, ఆ యిల్లు మనది"

సరికొత్త భవనాన్ని కార్మికులు ఆక్రమించుకున్నారు. ప్రతిగది లోనూ ఒక కుటుంబం. కూలీలకు ఇంత పెద్ద భవనమా? ఇది వాస్తవమా? మిధ్యా?

"ఏం శ్రీనివాసరావూ? నువ్వేనా ఈపని చేయించావు? నామీద అసూయ కొద్దీ చేయించావా? నువ్వుకూడా ఒక ఇల్లు కట్టుకోవచ్చును కున్నావా? పిచ్చివాడా నువ్వు ఇల్లు కట్టలేవు సరిగదా ఉన్న ఉద్యోగం వూడుతుంది. మళ్ళీ నీకు ఉద్యోగం దొరకదు. కార్మిక నాయకుడుగా బతకొచ్చనుకుంటున్నావా? కూలీలు నాతో అనుభవం గడించారు వాళ్ళు జాగ్రత్త పడతారు: నిన్ను కనిపెడుతూనే వుంటారు. వాళ్ళను నువ్వు మోసం చేసావని ఏమాత్రం అనుమానం కల్గినా నిన్ను హతమారుస్తారు ఇక యజమానులంటావా? కార్మికులను మోసం చెయ్యలేని నాయకుడు వాళ్ళకెందుకూ పనికిరాడు తెలిసిందా?

అయితే యీ లోకంలో మనం చాకిరేవులో రాతిబండల్లా దెబ్బలకు మొద్దుబారి బతకవలసిందేనా? ఈ జూదంలో ఓడిపోయి ఏమీఆశించడానికి వీలు లేకుండా శిక్ష అనుభవించవలసిందేనా? ఇక గత్యంతరం లేదా?

"ఉంది నాయనా! మన బతుకులు చిగిరించేందుకు మనం కూడా వాళ్ళతో కలిసి వుండవలసిందే ఇంతకంటె గత్యంతరం లేదు."

తెల్లవారింది మిల్లుకూసింది తెల్లవారే సరికి సన్యాసిరావు వీధరుగు మీదే పడుకుని వున్నాడు. మిల్లు కూతతో లేచికూర్చుని బద్దకంగా ఆవులించాడు. అవును ఇదే వాస్తవం. ఇది మిధ్యగాదు.